సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 7 । మే । 2025



చీనీ టన్ను రూ.24,560
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.24,560, కనిష్టంగా రూ.3 వేల ప్రకారం ధర పలికాయి.



భక్తిశ్రద్ధలతో ఈశ్వరమ్మ వర్ధంతి
సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ వర్ధంతిని ప్రశాంతి నిలయంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. 8లో

గరిష్టం/కనిష్టం
35.9°/22.1°
జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. వేసవి తాపం అధికంగా కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పకడ్బందీగా ‘గ్రూప్‌–1 మెయిన్స్‌’

- జేసీ శివ్‌ నారాయణ్‌ శర్మ



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ శివ్‌ నారాయణ్‌ శర్మ

అనంతపురం అర్బన్‌: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్‌–1 మెయిన్స్‌ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జాయింట్‌ కలెక్టర్‌ శివ్‌ నారాయణ్‌ శర్మ తెలిపారు. అనంతపురంలో పరీక్ష కేంద్రాలను జేసీ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 3న మెయిన్స్‌ పరీక్షలు ప్రారంభమయ్యాయన్నారు. 9వ తేదీతో ముగుస్తాయన్నారు. కేంద్రాల వద్ద అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించామన్నారు. పరీక్షకు 594 మంది హాజరుకావాల్సి ఉండగా నాల్గో రోజు 381 మంది హాజరయ్యారని, 213 మంది గైర్హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో లైజనింగ్‌ అధికారులు, ఎస్‌డీసీలు మల్లికార్జునుడు, తిప్పేనాయక్‌ ఉన్నారు.

డిప్యూటీ కలెక్టర్లకు పోస్టింగ్‌

అనంతపురం అర్బన్‌: పలువురు డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పోస్టింగ్‌ కోసం ఎదురు చూస్తున్న హనుమంతరావు ఆనంద్‌ పీఏబీఆర్‌ స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. అహుడా కార్యదర్శిగా ఉన్న డిప్యూటీ కలెక్టర్‌ జి.గౌరి శంకర్‌ రావు తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్‌గా బదిలీ అయ్యారు.

‘హెలికాప్టర్‌’ ఘటనలో మరో 9 మంది విచారణ

రామగిరి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి పర్యటన సందర్భంగా హెలికాప్టర్‌ విండ్‌ షీల్డ్‌ దెబ్బతిన్న ఘటనకు సంబంధించి మంగళవారం చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో రామగిరి మండల వైఎస్సార్‌ సీపీ నాయకులను విచారించారు. జెడ్పీటీసీ సభ్యుడు నాగార్జున, నరసింహారెడ్డి, ఆదిరెడ్డి, వెంకటరెడ్డి, జయచంద్రారెడ్డి, ముత్యాలన్న, శ్రీరాముల నాయక్‌, నారపరెడ్డి, దేవభూషన్‌రెడ్డి తదితరులను సీఐ శ్రీధర్‌ స్టేషన్‌కు పిలిపించి విచారించారు. ఆ రోజు ఏం జరిగింది...మీరు ఎక్కడున్నారు.. అంటూ ఆరా తీశారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. కాగా, హెలికాప్టర్‌ విండ్‌ షీల్డ్‌ దెబ్బతిన్న ఘటనకు సంబంధించిన కేసులో పోలీసులు 71 మందిని ముద్దాయిలుగా చేర్చగా, ఇప్పటికే 10 మందిని విచారణ చేసి బెయిల్‌పై విడుదల చేశారు. తాజాగా మంగళవారం రామగిరి మండలానికి చెందిన 9 మంది నాయకులను విచారించి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

బాలసదన్‌లోని ఇద్దరు బాలికలు అదృశ్యం

ధర్మవరం అర్బన్‌: పట్టణంలోని బాలసదన్‌లో ఉంటున్న ఇద్దరు బాలికలు మంగళవారం అదృశ్యమయ్యారు. వన్‌ టౌన్‌ సీఐ నాగేంద్రప్రసాద్‌ తెలిపిన వివరాల మేరకు... పెనుకొండ మెజిస్ట్రేట్‌ ఉత్తర్వుల మేరకు తల్లిదండ్రుల సంరక్షణలో లేని ఇద్దరి బాలికలను పట్టణంలోని ఎల్‌పీ సర్కిల్‌లో ఉన్న బాలసదన్‌లో ఉంచి ఆశ్రయం కల్పించారు. మంగళవారం ఉదయం బాలసదన్‌లోని వంట మనిషి, హౌస్‌ కీపర్‌ ఇద్దరు కలిసి కూరగాయలు తెచ్చేందుకు బయటకు వెళ్లగా... బాలికలిద్దరూ బాలసదన్‌ నుంచి బయటకు వెళ్లిపోయారు. అనంతరం బాలసదన్‌ నిర్వాహకులు వారి కోసం సమీప ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. అనంతరం బాలసదన్‌ అకౌంటెంట్‌ హరిత వన్‌టౌన్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి బాలికల కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

శాసనాలను పరిరక్షించాలి

పెనుకొండ: చరిత్రకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన పెనుకొండ కోటలోని శాసనాలను పరిరక్షించాలని చరిత్రకారుడు మైనాస్వామి డిమాండ్‌ చేశారు. మంగళవారం పెనుకొండలోని పలు శాసనాలను ఆయన పరిశీలించి, మాట్లాడారు. పెనుకొండ కోట నిర్మాణ విశేషాలను తెలుపుతూ ఉత్తర ప్రవేశ కోట ద్వారం లోపల వైపున ఒకటో బుక్కరాయ 1354లో లిఖించిన శాసనం గోడ కదిలిందన్నారు. శాసనం లిఖించిన రాయిలో చీలికలు ఏర్పడ్డాయన్నారు. పెనుకొండ కోట చరిత్రను తెలిపే అత్యంత ముఖ్యమైన శాసనం చెత్త కుప్పలో కలసిపోతోందని, నగర పంచాయతీ సిబ్బంది చొరవ తీసుకుని ఆ ప్రాంతాన్ని శుభ్రం చేసి, కంచె ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గోరంట్ల ఊరువాకిలి కోట గోడ సైతం లారీ ఢీకొనడంతో దెబ్బతిందన్నారు. శాసనాల పరిరక్షణకు భారత పురావస్తు శాఖ తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

అబాసుపాలు!





అనంతపురం, శ్రీ సత్యసాయి ఎస్పీలపై సర్వత్రా విమర్శలు

- పోస్టుల కోసం శాంతిభద్రతల్ని గాలికొదిలేశారనే ఆరోపణలు
- రామగిరి హెలీప్యాడ్‌ ఘటనలో వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు 71 మందిపై కేసులు
- హైకోర్టు ఆదేశాలిచ్చినా పెద్దారెడ్డిని తాడిపత్రికి వెళ్లనివ్వని దుస్థితి
- ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశంగా పోలీసు బాస్‌ల తీరు



అనంత ఎస్పీ జగదీష్‌



శ్రీసత్యసాయి ఎస్పీ రత్న

సాక్షి ప్రతినిధి, అనంతపురం: శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో అనంతపురం ఎస్పీ జగదీష్‌, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న ఘోర వైఫల్యం చెందారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. రెడ్‌బుక్‌ రాజ్యాంగానికి కంకణ బద్ధులై పనిచేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఓవైపు మట్టి, ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరుగుతోంది. మరోవైపు అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. గంజాయి విచ్చలవిడిగా లభ్యమవుతోంది. మట్కా మూడుపువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా సాగిపోతోంది. ఇవన్నీ పక్కనపెడితే టీడీపీ నాయకుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఇంత జరుగుతున్నా తమకేమీ పట్టనట్లు మిన్నకుండిపోతున్న పోలీసు బాస్‌లు.. ‘పచ్చ’ నేతలు చెప్పిందే వేదంగా నడుచుకుంటూ అభాసుపాలవుతున్నారనే చర్చ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సాగుతోంది.

ఇందుకేనా..

తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పోలీసులు పడుతున్న పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఇటీవల రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన కురుబ లింగమయ్య టీడీపీ నేతల చేతిలో దారుణ హత్యకు గురయ్యారు. ఈ క్రమంలో పాపిరెడ్డిపల్లిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా పోలీసులు పట్టించుకోలేదు. ఇది ఖాకీల మొదటి వైఫల్యం కాగా.. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్‌ మోహన్‌ రెడ్డి వస్తే హెలీప్యాడ్‌ దగ్గర జనాన్ని నియంత్రించలేక చేతులెత్తేయడం మరో వైఫల్యం. అక్కడ డీఎస్పీ స్థాయి అధికారి ఉండి కూడా ‘హెలీప్యాడ్‌ ఘటన చోటుచేసుకోవడం రాష్ట్ర పోలీసు చరిత్రలోనే పెద్ద మచ్చగా మిగిలిపోయింది. అయితే, తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రివర్స్‌ కేసులకు తెరలేపడం గమనార్హం. రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఒక ఘటనలో 71 మందిపై కేసులు పెట్టడం ఇదే మొదటిసారి అని చెబుతున్నారు. జగన్‌ రాక సందర్భంగా వచ్చిన జనాన్ని నియంత్రించేందుకు శాయశక్తులా ప్రయత్నించిన మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిపైనా కేసుల మీద కేసులు పెట్టి వేధింపులకు తెరతీయడం గమనార్హం.

హైకోర్టు చెప్పినా...

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తాడిపత్రి నియోజకవర్గంలో ప్రత్యేక రాజ్యాంగం నడుస్తున్నట్లు పోలీసులు వ్యవహరిస్తున్నారు. ఎన్నికలు జరిగి ఏడాది కావస్తున్నా మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని ప్రస్తుత ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి తండ్రి ప్రభాకర్‌రెడ్డి పట్టణంలోకి రానివ్వకుండా కుయుక్తులు పన్నుతున్నారు. దాడులకు తెర తీస్తున్నారు. ఇటీవల స్వయానా హైకోర్టే పెద్దారెడ్డికి తగిన భద్రత కల్పించి, తాడిపత్రికి పంపించాలని ఆదేశించినా పోలీసులు ఆ మేరకు చర్యలు తీసుకోవడం లేదు. ఏకంగా ఐపీఎస్‌ అధికారిని తాడిపత్రికి ఏఎస్పీగా వేసినా ఏమీ చేయలేని దుస్థితి. దీన్నిబట్టి తాడిపత్రిలో రౌడీరాజ్యం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక మాజీ ఎమ్మెల్యేకు రక్షణ కల్పించలేని దుస్థితిలో జిల్లా పోలీసులు ఉన్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నా ఎస్పీ జగదీష్‌ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే చర్చ జరుగుతోంది. తమ పోస్టులు కాపాడుకుంటే చాలు ఏది ఏమైనా కానీ అన్న రీతిలో రెండు జిల్లాల ఎస్పీలు ముందుకు సాగుతున్నారనే అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. విచ్చలవిడిగా మట్కా, జూదం జరుగుతుండటం, మద్యం ఏరులై పారుతుండటం, దొంగతనాలు భారీగా పెరిగి రెండు జిల్లాల్లోనూ అధ్వాన పరిస్థితులు నెలకొన్నా పట్టించుకోని పోలీసు బాస్‌లు.. లోకేష్‌ రెడ్‌బుక్‌ రాజ్యాంగానికి అనుగుణంగా నడుచుకుంటుండటంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

- అధికారులకు కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌ ఆదేశం



గృహ నిర్మాణ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షిస్తున్న కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌

ప్రశాంతి నిలయం: గృహ నిర్మాణ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌ హాలులో 2019 నుంచి 2024 వరకు మంజూరైన ఇళ్లు.. నిర్మాణాల పురోగతిపై ఆ శాఖ అధికారులతో సమీక్షించారు. ఆప్షన్‌ –3 కింద పనుల పురోగతిని ఆరా తీశారు. అనంతరం కలెక్టర్‌ మాట్లాడుతూ... జూన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఈక్రమంలో జిల్లాలో జూన్‌ 12 నాటికి 10,368 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై డివిజన్‌ స్థాయిలో ఆర్డీఓల ఆధ్వర్యంలో సంబంధిత ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్లు, డీఈఈలు సమీక్షా సమావేశాలు నిర్వహించుకోవాలని ఆదేశించారు. కదిరి అర్బన్‌, ధర్మవరం అర్బన్‌, లేపాక్షి, రామగిరి, సోమందేపల్లి, హిందూపురం, కొత్తచెరువు తదితర మండలాల్లో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించడం లేదన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అవగాహన కల్పించి ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో హౌసింగ్‌ పీడీ వెంకటనారాయణ, డీఈఈలు శంకర్‌లాల్‌ నాయక్‌, శ్రీనివాస్‌, శివకుమార్‌ నాయక్‌, వెంకటరమణారెడ్డి, మండల ఇంజినీరింగ్‌ అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్‌ సప్లిమెంటరీకి పకడ్బందీ ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్‌ఓ విజయ సారథి

ప్రశాంతి నిలయం: ఇంటర్‌ అడ్వాన్స్‌డ్‌ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్‌ఓ విజయసారథి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇంటర్‌ సప్లిమెంటరీ పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ నెల 12వ తేదీ నుంచి ఇంటర్‌ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తాగునీరు, ఫర్నిచర్‌, ఫ్యాన్‌లు తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. నిరంతర విద్యుత్‌ సౌకర్యం ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం డీఐఈఓ మౌల మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఉదయం 36 సెంటర్లు, మధ్యాహ్నం 22 సెంటర్లలో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్‌, సిట్టింగ్‌ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణ కమిటీ మెంబర్లుగా శ్రీరామరాజు, చెన్నకేశవ ప్రసాద్‌, శ్రీనివాసులును నియమించామన్నారు. కేంద్రాల్లో తాగునీరు, ఫస్ట్‌ ఎయిడ్‌ తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సమావేశంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌ కుమార్‌, విద్యుత్‌ శాఖ ఎస్‌ఈ సంపత్‌ కుమార్‌, కార్మికశాఖ అధికారి సూర్యనారాయణ, విద్యాశాఖ అధికారి లింగన్న, పోస్టల్‌ శాఖ అధికారి విజయ్‌, రవాణా శాఖ అధికారి ఇనయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవా..గోవింద



సర్వభూపాల వాహనంపై కొలువైన లక్ష్మీచెన్నకేశవుడు



సింహ వాహనంపై కొలువైన లక్ష్మీచెన్నకేశవస్వామి



లక్ష్మీచెన్నకేశవస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ధర్మవరం అర్బన్‌: లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ధర్మవరం గోవింద నామస్మరణతో మార్మోగుతోంది. ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం లక్ష్మీచెన్నకేశవస్వామి ఉదయం సర్వభూపాల వాహనం, సాయంత్రం సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అంతకుముందు ఉదయం స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. అనంతరం అర్చకులు స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని సర్వభూపాల వాహనంపై కొలువుదీర్చి పూజలు చేశారు. సాయంత్రం సింహ వాహనంపై కనిపించిన లక్ష్మీచెన్నకేశవ స్వామిని చూసి భక్తులు తరించారు. గోవింద నామస్మరణ చేస్తూ ఆధ్యాత్మిక సాగరంలో మునిగిపోయారు. కాగా, బుధవారం లక్ష్మీచెన్నకేశవస్వామి కల్పవృక్ష, హనుమద్‌ వాహనాలపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఆర్డీటీని కాపాడుకుంటాం



బత్తలపల్లి కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

- కదం తొక్కిన ప్రజా సంఘాలు

బత్తలపల్లి: ‘ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్‌ చేసేదాకా పోరాడతాం...పేదల సంస్థ ఆర్డీటీని కాపాడు కుంటాం...సేవ్‌ ఆర్డీటీ’ అంటూ ప్రజా సంఘాలు కదం తొక్కాయి. బత్తలపల్లి మండల కేంద్రంలో మంగళవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముందుగా వారు ఆర్డీటీ వ్యవస్థాపకులు విన్సెంట్‌ ఫెర్రర్‌ ఘాట్‌లో పూజలు చేశారు. అనంతరం ఆర్డీటీ ఆఫీసు నుంచి ప్రధాన కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు ప్రధాన కూడలిలో మానవ హారం ఏర్పాటు చేసి ‘సేవ్‌ ఆర్డీటీ’ అంటూ నినదించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదల పాలిట కల్పతరువుగా మారి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఆర్డీటీ సంస్థకు నిధులు రాకుండా కట్టడి చేయడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్‌ చేయాలని, లేని పక్షంలో నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్‌ స్వర్ణలతకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, ఎస్సీ జన సంఘం జాతీయ అధ్యక్షుడు దాసగానిపల్లి కుళ్లాయప్ప, ఎమ్మార్పీఎస్‌ ధర్మవరం డివిజన్‌ నాయకులు సాకే దండోరా లక్ష్మన్న, ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కమతం కాటమయ్య, ఎస్సీ జన సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి రాంప్రసాద్‌, బహుజన సమాజ్‌ పార్టీ ధర్మవరం నియోజక వర్గ ఇన్‌చార్జి సాకే వినయ్‌కుమార్‌, సీపీఐ మండల కార్యదర్శి బండల వెంకటేష్‌, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, ఎరుకల సంఘం మహిళా అధ్యక్షురాలు లక్ష్మీకాంతమ్మ, కుమ్మర శాలివాహన సంఘం నాయకులు వెంకట రమణ, నిడిగల్లు ధను, తాడిమర్రి, బత్తలపల్లి మండలాల ఆర్డీటీ ఉపాధ్యాయులు సుదర్శనం, రామకృష్ణ, వీరనారప్ప తదితరులు పాల్గొన్నారు.

జీజీ హట్టిలో ప్రబలిన అతిసారం





వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న మోనిక, వినయ్‌కుమార్‌, అతిసారం బాధితులను పరామర్శిస్తున్న ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌, డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం

- 11 ఏళ్ల చిన్నారి మృతి.. 24 మందికిపైగా తీవ్ర అస్వస్థత
- బాధితులను కర్ణాటక రాష్ట్రం మధుగిరి, తుమకూరు ఆస్పత్రులకు తరలింపు
- జీజీ హట్టిలో వైద్య శిబిరం ఏర్పాటు
- చికిత్స అందిస్తున్న అధికారులు

రొళ్ల: మండలంలోని జీజీ హట్టిలో అతిసారం ప్రబలింది. 980 మందికిపైగా జనాభా ఉన్న ఈ గ్రామంలో రెండురోజులుగా అతిసారం ప్రబలింది. దీంతో గ్రామస్తులంతా వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. ఈక్రమంలోనే మంగళవారం ఉదయం భాగ్యమ్మ, చిక్కిరప్ప కుమార్తె అమూల్య (11) తీవ్ర అస్వస్థతో మృతి చెందింది. మరో 24 మంది అతిసారంతో బాధపడుతున్నారు.

హుటాహుటిన ఆస్పత్రులకు తరలింపు..

అమూల్య మృతితో గ్రామస్తులు తీవ్ర ఆందోళన చెందారు. వెంటనే అతిసారంతో బాధపడుతున్న మిగతా వారిని కర్ణాటక ప్రాంతాల్లోని ఆస్పత్రులకు తరలించారు. పెద్దపూజారప్ప కుమారుడు చిత్తయ్య, చిక్కన్న, చిక్కమ్మ తదితరులు కర్ణాటక రాష్ట్రం మధుగిరి, తుమకూరులో చికిత్స పొందుతున్నారు. అదేవిధంగా జయమ్మ, దివ్య, వినయ్‌ కుమార్‌, లక్ష్మమ్మ, అమృతవల్లి, కవిత, కుమార్‌, చిక్కిరప్ప, కరియన్న, మోనిక, మధుశ్రీ, రొద్ద చిక్కన్న, మారన్న తదితరులతో పాటు మరికొందరు అతిసారంతో అస్వస్థతకు గురై మధుగిరి, తుమకూరు, హిందూపురం ఆస్పత్రుల్లో చేరి చికిత్సలు పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రాథమిక పాఠశాల ఆవరణలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అత్యవసర చికిత్సలు అందిస్తున్నారు. 55 మందికి పైగా సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. తర్వాత రెవెన్యూ, పంచాయతీ రాజ్‌శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నిల్వ ఉంచిన నీటిని పారబోయించారు. వీధుల్లో బ్లీచింగ్‌ పౌడర్‌ చల్లించారు.

కలుషిత నీరే కారణమా..

తాగునీరు కలుషితం కావడం వల్లే జీజీ హట్టిలో అతిసారం ప్రబలినట్లు తెలుస్తోంది. గ్రామానికి రక్షిత మంచినీటి సౌకర్యం లేక సుదూర ప్రాంతాల నుంచి తెచ్చుకున్న నీటిని రోజుల తరబడి నిల్వ ఉంచుకుని తాగడం వల్లే అతిసారం ప్రబలినట్లు తెలుస్తోంది. అలాగే ఇటీవల గ్రామంలో జరిగిన ఓ శుభ కార్యంలో తిన్న ఆహారం కూడా ఇందుకు కారణం అయి ఉండవచ్చని గ్రామస్తులు చెబుతున్నారు.

వ్యక్తిగత శుభ్రతం పాటించాలి..

ప్రజలు వ్యక్తిగత శుభ్రతను పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌ కుమార్‌, డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం తదితరులు పేర్కొన్నారు. మంగళవారం వారు జీజీ హట్టి గ్రామంలో పర్యటించారు. ఆర్‌డబ్ల్యూఎస్‌ ఎస్‌ఈ మల్లికార్జున, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మంజువాణి, డీఐఓ డాక్టర్‌ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్‌ డీఈ మనునాయక్‌, తహసీల్దార్‌ షేక్షావలి, ఎంపీడీఓ రామారావు తదితరులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించుకోవాలని సూచించారు.

రెడ్డెప్పశెట్టికి ఉద్యాన ఉచ్చు

- బినామీలు, బంధువుల పేరిట ఉద్యానశాఖ నుంచి సబ్సిడీలు
- ఒక సర్వే నంబరుతో దరఖాస్తు.. ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు
- సబ్సిడీ డ్రిప్‌ మంజూరు అవకతవకల్లో గతంలోనే రెడ్డెప్పశెట్టిపై కేసు



రెడ్డప్పశెట్టి పొలంలోని ఫారంపాండ్‌ను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి మహేష్‌

చిలమత్తూరు: ప్రభుత్వ భూములు, ప్రకృతి వనరులను దోచుకుంటూ రూ.కోట్లు ఆర్జించిన రియల్టర్‌ రెడ్డెప్పశెట్టి అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తుండగా...ఉద్యాన శాఖ అప్రమత్తమైంది. నిబంధనలకు విరుద్ధంగా పాలీహౌస్‌లు, కమ్యూనిటీ ఫారంపాండ్లు నిర్మాణాలతో పాటు ఏకంగా ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టిన అంశంపై ‘అక్రమాలు కోకొల్లలు’ శీర్షికన ‘సాక్షి’ కథనం ప్రచురించింది. దీంతో ఉద్యాన శాఖ అధికారులు స్పందించి విచారణ వేగవంతం చేశారు. రెడ్డెప్పశెట్టి ప్రభుత్వ భూములు, ఈడీ అటాచ్‌మెంట్‌ భూముల్లోనే పాలీహౌస్‌లు, కమ్యూనిటీ ఫారంపాండ్ల నిర్మాణాలు చేపట్టినట్టు గుర్తించారు. రైతులకు లీజు హక్కు ఇవ్వడం ద్వారా సబ్సిడీలు పొందవచ్చన్న నిబంధనను అడ్డం పెట్టుకుని తన బినామీలకు లీజు హక్కు ఇచ్చి ప్రభుత్వం నుంచి భారీగా సబ్సిడీలను పొందినట్టు అధికారులు గుర్తించారు. ఉద్యానశాఖ మంజూరు చేసిన కమ్యూనిటీ ఫారంపాండ్‌ను సైతం రెడ్డెప్పశెట్టి ప్రభుత్వ భూమిలో నిర్మించి సొంతానికి వాడుకుంటున్నారు. కమ్యూనిటీ ఫారంపాండ్‌ ఉద్దేశాన్ని పక్కనపెట్టి లబ్ధి పొందినట్టుగా అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో తమను మోసం చేసి ప్రజాధనం లూటీ చేసిన రెడ్డెప్పశెట్టికి ఉచ్చు బిగించేందుకు అధికారులు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

గతంలో కేసు నమోదైనా...

ఎల్లయ్య, పుల్లయ్య అంటూ స్థానికంగా లేని రైతుల పేర్లతో రెడ్డెప్పశెట్టి రూ.కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసినట్టుగా గతంలోనే అధికారులు గుర్తించారు. రైతులను మోసం చేసి డ్రిప్‌ ఇరిగేషన్‌ మెటీరియల్‌లోనూ సబ్సిడీలు పొందిన ఆయనపై కేసు నమోదు చేశారు. అయినా ఉద్యాన శాఖ అధికారులు రూ.కోట్ల సబ్సిడీలు ఎలా ఇచ్చారన్న విషయంలో సమగ్ర దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతానికి ప్రభుత్వాన్ని మోసం చేసి సబ్సిడీ పేరుతో పొందిన కోట్లాది రూపాయలను రికవరీ చేయడంతో పాటు కేసు నమోదు చేసే అవకాశం ఉన్నట్టుగా తెలుస్తోంది. రెడ్డెప్పశెట్టి అవినీతి అక్రమాల్లో ఆయన ఎస్టేట్‌ సమీపంలోని ఓ గ్రామంలోని ఇద్దరి రియల్టర్ల పాత్ర కూడా ఉన్నట్టుగా తెలుస్తోంది. ఆ దిశగా కూడా అధికారులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి మృతి

హిందూపురం: స్థానిక రేషన్ కాలనీ వద్ద రైలు పట్టాల పక్కన పొదల్లో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు మంగళవారం గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడు చేరుకుని పరిశీలించారు. సుమారు 55 ఏళ్ల వయసున్న వ్యక్తి పట్టాలు దాటే సమయంలో రైలు ఢీకొనడంతో మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. మృత్యుడిని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండడంతో రెండు మూడు రోజుల క్రితం ఘటన జరిగి ఉండవచ్చునని భావించారు. ఆచూకీ తెలిసిన వారు సంప్రదించాలని హిందూపురం రైల్వే పోలీసులు కోరారు.

వృద్ధుడి బలవన్మరణం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని న్యామద్దెల గ్రామానికి చెందిన ఈశ్వరయ్య (68) ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయంతో జీవనం సాగిస్తున్న ఈశ్వరయ్యకు భార్య నారాయణమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఆరు నెలలుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడేవాడు. సోమవారం నొప్పి తీవ్రత తాళలేక మధ్యాహ్నం ఇంటి వద్ద ఊజీ మాత్రలు మింగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం ఆయన మృతి చెందాడు. ఘటనపై సీకేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈశ్వరయ్య (ఫైల్)

కరాటే శిక్షణ.. ఆత్మరక్షణ

- యుద్ధ క్రీడల్లో రాణిస్తున్న కదిరి విద్యార్థినులు



జాతీయ పోటీల్లో విజేత షీల్డ్ అందుకుంటున్న నిఖిత (ఫైల్)



కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులు

కదిరి టౌన్: సమాజంలో నిత్యం ఎక్కడో ఒకచోట మహిళలు, బాలికలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. ఇలాంటి తరుణంలో తమ పిల్లలను చదువుల కోసం బయటికి పంపేందుకు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అయితే బాలికలకు చదువు ఒక్కటే సరిపోదు... అపద సమయంలో తమను తాము రక్షించుకునేందుకు అసవరమైన యుద్ధ కళనూ అభ్యసించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందులో భాగంగానే కదిరి ప్రాంతానికి చెందిన పలువురు బాలికలు కరాటే అభ్యసించి, రాష్ట్ర స్థాయిలో అవార్డులతో మెరిశారు.

ప్రత్యేక శిక్షణతో రాటుదేలుతూ..

కదిరిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో విద్యార్థులకు ప్రత్యేకంగా కరాటే శిక్షణను మాస్టర్ షెక్షావలి అందిస్తున్నారు. ఈ శిక్షణలో పలువురు విద్యార్థినులు రాణిస్తున్నారు. 2024లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన కరాటే పోటీల్లో కదిరికి చెందిన నిఖిత, సిరి పాల్గొన్నారు. వెల్స్ అసోసియేషన్ తరపున ఒంగోలు, పార్వతీపురంలో జరిగిన ఎస్‌జీఎఫ్‌ఐ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. తెలంగాణలో నిర్వహించిన సీఎం-కేసీఆర్ కప్, విశాఖపట్నంలో జరిగిన 4వ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్ షిప్‌ల్లో పాల్గొని బంగారు, వెండి పతకాలు దక్కించుకున్నారు. అలాగే ఫెన్సింగ్‌లోనూ రాష్ట్ర స్థాయి పోటీలో నిఖిత, సిరి పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించారు. ఈ ఏడాది జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగిన బాక్సింగ్ పోటీల్లోనూ పంజాబ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లోనూ విశేష ప్రతిభను కనబరిచారు.

ఆత్మస్థైర్యం పెరిగింది



స్వతహాగా నేను చాలా భయస్తురాలిని. అమ్మ, నాన్న ప్రోత్సాహంతో కరాటే అభ్యసించడం మొదలు పెట్టిన తర్వాత నాలో ఆత్మస్థైర్యం పెరుగుతూ వచ్చింది. దీంతో ఇప్పుడు ఏ విషయంపైనైనా నేను నిర్భయంగా మాట్లాడుగలుగుతున్నా. అన్ని స్కూళ్లలోనూ కరాటే మాస్టర్లను ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పిస్తే ఈవ్ టీజింగ్ లాంటివి అరికట్టవచ్చు. కరాటే సాధన ద్వారా నాలో ఏకాగ్రత పెరిగింది. ఫలితంగా ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 964 మార్కులు సాధించగలిగాను. కరాటేలోనే రాణించి క్రీడా కోటా కింద సివిల్స్‌కు ఎంపిక కావాలన్నదే నా లక్ష్యం. – నిఖితాబాయి, కదిరి

పోలీస్ అధికారినవుతా



చిన్నప్పటి నుంచి కరాటే అంటే చాలా ఇష్టం. అమ్మ, నాన్న ప్రోత్సాహిస్తూ కరాటేతో పాటు జూడో లోనూ శిక్షణ ఇప్పించారు. క్రీడలతో నాలో ఏకాగ్రత పెరిగి ఇంటర్‌లో 834 మార్కులు సాధించగలిగాను. క్రీడా కోటాలో పోలీస్ అధికారి కావాలనే లక్ష్యంతో మరింత సాధన చేస్తున్నా. – సిరి, కదిరి

రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని చూపుతున్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం సీకేపల్లి మండలం ప్యాదిండి గ్రామం వద్ద స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ధర్మవరం వైపు నుంచి బొలెరో వాహనంలో కర్ణాటకకు 47 కిలోల బరువున్న 57 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లుగా గుర్తించామన్నారు. వాహనాన్ని సీజ్ చేసి, ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కులగణన సక్రమంగా జరిగితే ప్రజలకు సమ న్యాయం

- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు రఘువీరా



మీడియాతో మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

మడకశిర రూరల్: కేంద్ర ప్రభుత్వం కులగణన సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తే దేశంలోని 140 కోట్ల మంది ప్రజలకు సమ న్యాయం జరిగే అవకాశం ఉంటుందని మాజీ మంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు రఘువీరారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మడకశిర మండలం నీలకంఠాపురంలో మీడియాతో మాట్లాడారు. కేంద్రం కులగణనపై కార్యాచరణ ప్రకటించాలన్నారు. దాని ఫార్మెట్ తయారీపై అన్ని రాజకీయ పార్టీలతో పాటు లోకసభ, రాజ్యసభల్లో చర్చించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా కులగణన సర్వే ఆరు నెలల్లోనే పూర్తి చేసి వివరాలు ప్రకటించాలన్నారు. కాంగ్రెస్‌తో పాటు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఒత్తిడి తేవడంతోనే కులగణనకు కేంద్రం అంగీకరించిందన్నారు. ఈ సర్వేను తాము స్వాగతిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కులగణన విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించి వేగవంతం చేసేలా చూడాలన్నారు. కులగణన పూర్తయితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సీట్లు పెరిగి న్యాయం జరుగుతుందన్నారు.

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

ధర్మవరం అర్బన్: అదనపు కట్నం కోసం వేధిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ధర్మవరంలోని సత్యసాయినగర్‌కు చెందిన విజయలక్ష్మిని అదనపు కట్నం కోసం భర్త రవికుమార్, అత్త లక్ష్మీదేవి, మామ పెద్దన్న, ఆడపడుచు పద్మావతి, మరిది పెద్దన్న వేధిస్తున్నారని బాధితురాలు చేసిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వేధింపులపై కేసు నమోదు..

స్థానిక తారకరామాపురానికి చెందిన షేక్ మహమ్మద్ వలి, తల్లి జుబేదా, తండ్రి ఫకృద్దీన్, తమ్ముళ్లు మసూద్‌వలి, జిలాన్‌పై వేధింపుల కేసు నమోదు చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు. తనను తరచూ వారు వేధిస్తున్నారంటూ మహమ్మద్ వలి భార్య షేక్ నస్రాసి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

జిల్లా జైలులో 9న మామిడి ఫలసాయం వేలం

బుక్కరాయసముద్రం: మండలంలోని జిల్లా ఓపెన్ ఎయిర్ జైల్లో ఈ నెల 9న ఉదయం 10.30 గంటలకు మామిడి తోటల ఫలసాయాన్ని బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఓపెన్ ఎయిర్ జైలు సూపరింటెండెంట్ కాంతారాజ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3,544 మామిడి చెట్లకు కాసిన కాయలకు కడప రేంజ్ ప్రాంతీయ జైళ్ల ఉపశాఖ అధికారి సమక్షంలో వేలం నిర్వహిస్తామరు. వేలంలో పాల్గొనేవారు రూ.లక్ష డిపాజిట్ చెల్లించాలన్నారు. ఆసక్తి ఉన్న రైతులు, వ్యాపారులు వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

9కి వేలం వాయిదా..

బుక్కరాయసముద్రం మండలంలోని అనంతపురం జిల్లా జైల్లో ఈ నెల 8న జరగాల్సిన వేలం 9వ తేదీ మధ్యాహ్నానికి వాయిదా వేసినట్లు సూపరింటెండెంట్ రహ్మాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 25వేల కిలోల వేరు శెనగ చెక్కకు వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనేవారు రూ.20 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు.

ఆయిల్ ట్యాంకర్ బోల్తా



గుంతకల్లు రూరల్: మండలంలోని తిమ్మాపురం సమీపంలో ఉన్న పద్మావతి ఆయుర్వేదిక్ కళాశాల వద్ద బళ్లారి వైపు వెళుతున్న ఓ ఆయిల్ ట్యాంకర్ బోల్తాపడింది. మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో అదుపు తప్పి రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడింది. ఘటనలో 33 కేవీ విద్యుత్ లైన్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభంతో పాటు దానికి సపోర్ట్‌గా నిలిపిన మరో స్తంభమూ కూలింది. విద్యుత్ వైర్లు కిందకు వేలాడాయి. స్థానికులు అప్రమత్తమై సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేశారు. ప్రమాదంలో గాయపడిన ట్యాంకర్ డ్రైవర్ అంజాద్‌బాషాను ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సీహెచ్‌ఓలను రెగ్యులర్ చేయాలి



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న సీహెచ్‌ఓలు, ఎంఎల్‌హెచ్‌పీలు

పుట్టపర్తి అర్బన్: ఆయుష్మాన్ భారత్ నిబంధనల మేరకు 6 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న తమను రెగ్యులర్ చేయాలంటూ కూటమి ప్రభుత్వాన్ని సీహెచ్‌ఓలు డిమాండ్ చేశారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద సీహెచ్‌ఓలు, ఎంఎల్‌హెచ్‌పీలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారానికి 8వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తమ న్యాయపరమైన సమస్య పరిష్కారం కోరుతూ ఇటీవల వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిస్తే... 'మిమ్మల్ని తొలగిస్తే రాష్ట్ర ఖజానాకు రూ.500 కోట్లు మిగులుతుంది' అని చెప్పడం అన్యాయమన్నారు. న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చే వరకూ సమ్మె కొనసాగిస్తామన్నారు.

అదిరిందయ్యా హనుమంతు!

సోమందేపల్లిలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో కోతుల బెడద ఎక్కువ కావడంతో అక్కడి వాచ్‌మెన్ హనుమంతు సరికొత్త అవతారం ఎత్తాడు. అర్చకుడు దాస్ సహకారంతో ఎలుగుబంటి డ్రెస్ కుట్టించుకుని దానిని ధరించి తిరుగుతుండడంతో కోతులు భయపడి ఆలయ పరిసరాలవైపు తొంగి చూడడం లేదు. ఇది గమనించిన గ్రామస్తులు 'ఐడియా అదిరిందయ్యా హనుమంతు' అంటూ అభినందిస్తున్నారు. – సోమందేపల్లి:



ఎలుగుబంటి వేషంలో హనుమంతు

భక్తిశ్రద్ధలతో ఈశ్వరమ్మ వర్ధంతి



సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న రత్నాకర్‌రాజు దంపతులు



విశ్వజననీ ఈశ్వరమ్మ నాటికలోని ఓ సన్నివేశం

ప్రశాంతి నిలయం: సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ వర్ధంతిని మంగళవారం వేలాది భక్తుల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏటా మే 6న ఈశ్వరమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఈశ్వరమ్మ డే నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పుట్టపర్తిలోని సమాధి రోడ్డులో ఉన్న సత్యసాయి తల్లిదండ్రులు ఈశ్వరమ్మ, పెద వెంకమరాజుల ఘాట్‌లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈశ్వరమ్మ విగ్రహానికి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ రాజు దంపతులు, ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తి పూలమాలలు వేసి, పూజలు చేశారు. సత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులు, భక్తులు ఈశ్వరమ్మను కొనియాడుతూ భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం అన్న దానం చేశారు. అలాగే సాయికుల్వంత్ సభా మందిరంలోని సత్యసాయి మహాసమాధి చెంత రెండు వందల మంది పేద భక్తుల జీవనోపాదుల కోసం ఆర్.జె.రత్నాకర్‌రాజు దంపతులు కుట్టుమిషన్లు, గ్రైండర్‌లు, వీల్‌చైర్‌లు, స్ప్రేయర్లు, ఎలక్ట్రీషియన్ కిట్‌లు పంపిణీ చేశారు. సాయంత్రం ఏపీ బాలవికాస్ విద్యార్థులు సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ జీవిత ఘట్టాలను వివరిస్తూ 'విశ్వ జననీ ఈశ్వరమ్మ' పేరుతో నాటికను ప్రదర్శించారు.

నేటి నుంచి బండి శూల తిరునాల

పామిడి: మండలంలోని రామరాజుపల్లిలో బుధవారం నుంచి ఆదివారం వరకూ వరుసగా ఐదు రోజులపాటు శుడిబండి(బండిశుల) తిరునాల నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. తిరునాల రోజు బండికి తాటిచెట్టు కాండాన్ని నిటారుగా తాళ్లతో కట్టి నిలబెడతారు. ఆ కాండం చివరి భాగాన బెలూన్లతోనూ, పూలదండలతో అలంకరించి దాన్ని రథంగా భావిస్తారు. తాటి కాండం కిందకు ఒరగకుండా దానిపై ప్రజలు ఎక్కి కూర్చొని ఉంటారు. తిరునాల ప్రారంభం రోజు ఈ రథాన్ని రామరాజుపల్లి ఎద్దులు, చుట్టుప్రక్కల గ్రామాల ఎద్దులతో కాశేపల్లి మీదుగా గుత్తి అనంతపురం గ్రామం వైపు లాగిస్తారు. ఆ సమయంలో ఈ రథం వెంబడి సుంకులమ్మ, ముత్యాలయ్య దేవతా విగ్రహాలను చిలకమ్మ పల్లకిలో ఊరేగింపుగా తీసుకెళ్తారు. బుధవారం రాత్రికి ఆ గ్రామం చేరగానే గుడి చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తారు. గురువారం రాత్రికి రామరాజుపల్లికి చేరుతుంది. తిరిగి శుక్రవారం రాత్రికి బయలుదేరి శనివారం గుత్తి అనంతపురానికి చేరుతుంది. ఆ రోజు రాత్రి అక్కడ నుంచి బయలుదేరి ఆదివారం తెల్లవారుజామున రామరాజుపల్లికి చేరడంతో తిరునాల ముగుస్తుంది. ముగింపురోజు గ్రామంలో మొక్కుబడుల చెల్లింపులో భాగంగా గ్రామస్తులు దేవర చేస్తారు. ఈ సందర్భంగా బంధువులు, స్నేహితులకు ఆతిథ్యం ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. దేవర కార్యక్రమానికి తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ముఖ్య పట్టణాలను నుంచి సైతం భక్తులు రావడం విశేషం. గ్రామంలోని ప్రజలు అధికంగా ముత్యాలయ్య, సుంకులమ్మ పేర్లను కలిగి ఉండడం ఆ దేవతలపై వారికున్న భక్తి ప్రపత్తులకు నిదర్శనంగా నిలుస్తోంది.

రూ.లక్ష నగదు అపహరణ



నగదు అపహరించుకుని వెళుతున్న దుండగుడు (సీసీ కెమెరా ఫుటేజీ)

గుత్తి రూరల్: బైక్ సైడ్ బ్యాగ్‌లో ఉంచిన రూ.లక్ష నగదును ఓ దుండగుడు అపహరించారు. ఈ దృశ్యం సీసీ కెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమైంది. వివరాలు... గుత్తి మండలం మాముడూరు గ్రామానికి చెందిన రైతు మల్లికార్జున పంటల సాగు కోసమని గుత్తిలోని కెనరా బ్యాంకులో బంగారు నగలు తాకట్టు పెట్టి రూ.లక్ష రుణం తీసుకున్నాడు. ఈ నగదును బ్యాంక్ వద్ద నిలిపిన తన బైక్ సైడ్ బ్యాగ్‌లో ఉంచి ఎదురుగా ఉన్న దుకాణంలో సిగరెట్ కొనుగోలు చేసేందుకు వెళ్లాడు. అయితే అప్పటికే అక్కడ మాటు వేసిన దుండగుడు బైక్ బ్యాగులోని నగదు ఉంచిన సంచిని తీసుకుని గుట్టుచప్పుడు కాకుండా వెళ్లిపోయాడు. సిగరెట్ కాల్చి తిరిగి వచ్చిన మల్లికార్జున బ్యాగ్‌లో నగదు కనిపించకపోవడంతో వెంటనే సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బ్యాంకు పరిసరాల్లో ఏర్పాటు చేసిన సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తే బ్యాగులోని నగదును తీసుకెళుతున్న వ్యక్తి ఆ వెనుకనే వచ్చిన మరో బైక్‌పై ఎక్కి వెళ్లిపోయే దృశ్యాలు స్పష్టంగా కనిపించాయి. బాధిత రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అప్పు చెల్లించమంటే దాడి చేశారు!

యల్లనూరు: తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాలని కోరిన వ్యక్తిపై రుణ గ్రహీత దాడికి తెగబడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు...యల్లనూరు మండలం చింతకాయమంద గ్రామానికి చెందిన శ్రీరంగనాయకులు మూడేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన నిమ్మకాయల రామాంజనేయులుతో రూ.50 వేలు అప్పుగా తీసుకున్నాడు. ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించాలంటూ సోమవారం రాత్రి శ్రీరంగనాయకులును ఆయన ఇంటి వద్దకెళ్లి రామాంజనేయులు అడిగాడు. దీంతో శ్రీరంగనాయకులు, ఆయన కుమారులు రమేష్, రంగమహేష్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ రామాంజనేయులుపై ఇనుప పైపులతో దాడి చేశారు. ఘటనలో తలకు తీవ్ర గాయమైన రామాంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మద్యం అనుకుని విషపూరిత ద్రావకం తాగి యువకుడి మృతి

అనంతపురం: మద్యం మత్తులో విషపూరిత ద్రావకం తాగి ఓ యువకుడు మృతి చెందాడు. అనంతపురం నాల్గో పట్టణ సీఐ కనుమూరి సాయినాథ్ తెలిపిన మేరకు... నగర శివారులోని ఎ.నారాయణపురం గ్రామానికి చెందిన రాజేష్ (20) మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం మత్తులో ఇంటికి చేరుకునే క్రమంలో ఓ మద్యం బాటిల్‌ను తన వెంట తీసుకెళ్లేవాడు. మంగళవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి చేరుకున్న రాజేష్... కాసేపటి తర్వాత మద్యం బాటిల్ అనుకుని చేతికి అందిన బాటిల్ తీసుకుని అందులోని ద్రావకాన్ని తాగేశాడు. అపస్మారక స్థితిలో పడి ఉండడం, ఆ పక్కనే విషపూరిత ద్రావకం బాటిల్ ఉండడం గమనించిన కుటుంబసభ్యులు వెంటనే సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



- కళ తప్పిన కనకాంబరాలు

అనంతపురం రూరల్ మండలం పూలకుంట, పసలూరు, చియ్యేడు తదితర గ్రామాల్లో రైతులు కనకాంబరం పూలు సాగు చేశారు. కాపు బాగానే ఉన్నా మార్కెట్లో సరైన ధరల్లేవు. ప్రస్తుతం కిలో రూ.150 నుంచి రూ.200 మాత్రమే పలుకుతుండటంతో గిట్టుబాటు కూడా కావడం లేదని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కిలో కనకాంబరాలు రూ.500 నుంచి రూ.800 పలికాయని, ప్రస్తుతం గిట్టుబాటు ధర లేకపోవడంతో నష్టాలు చవి చూడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం